లెక్క ఇక పక్కా


నగరపాలక సంస్థ కార్యాలయం

- అసెస్‌మెంట్ల క్రమబద్ధీకరణే లక్ష్యంగా నగరపాలక సంస్థ అడుగులు
- కొత్త పన్నుల కోసం కసరత్తు
- సచివాలయాల వారీగా ప్రణాళిక

కాకినాడ: పన్నుల రూపంలో వచ్చే ఆదాయాన్ని పూర్తిస్థాయిలో రాబట్టే దిశగా నగరపాలక సంస్థ దృష్టి పెట్టింది. ఇప్పటికే వసూలు చేస్తున్న ఆస్తిపన్ను, కుళాయి పన్ను, ఖాళీ స్థలాల పన్నుల ద్వారా అదనపు ఆదాయాన్ని సాధించేందుకు దృష్టిపెట్టింది. ఈ మేరకు నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఆయా విభాగాల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. దీంతో పన్నుల పరిధిలోకి రాని గృహాలు, వ్యాపార సముదాయాలను గుర్తించే పనిలో కార్పొరేషన్ యంత్రాంగం దృష్టిసారించింది.

కొత్త అసెస్‌మెంట్ల కోసం...

నగరపాలక సంస్థ పరిధిలో ప్రస్తుతం 82,606 అసెస్‌మెంట్లు ఉన్నాయి. వీటి ద్వారా ఏటా రూ.47 కోట్లు పన్నుల రూపంలో వసూలు కావాల్సి ఉంది. 90 శాతానికి పైగా పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని కూడా సాధిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల ద్వారా వచ్చే సుమారు నాలుగు కోట్లు మినహా మిగిలిన ఆస్తిపన్ను బకాయి దాదాపు వసూలు చేస్తోంది.

కొత్త పన్నులపై దృష్టి

నగర పరిధిలో ఎప్పటికప్పుడు పన్నులు వేస్తున్నప్పటికీ ఇప్పటికీ అనేక గృహాలు, వాణిజ్య సముదాయాలు పన్నుల పరిధిలోకి రాని పరిస్థితి ఉంది. వాస్తవానికి ఇల్లు నిర్మించినప్పటికీ పన్ను వేయించుకోనివారు కొంతమంది అయితే, ఒక అంతస్తువరకే పన్ను కడుతూ అదనపు అంతస్తుల నిర్మించిన వారికి కూడా అదనపు పన్ను వేయాల్సి ఉంది. అలాగే గృహ అవసరాలకు నిర్మించి, వాణిజ్య అవసరాలకు మార్చిన ఇళ్లకు కూడా పన్నులు వేయాల్సి ఉందని అధికారులు అంటున్నారు. మరో వైపు పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణం కూడా జరుగుతున్న నేపథ్యంలో కొత్త అసెస్‌మెంట్లను కూడా గుర్తించి పన్ను వేయగలిగితే అదనపు ఆదాయం సమకూరగలదన్న ఆలోచనలో కార్పొరేషన్ యంత్రాంగం ఉంది.

సచివాలయాల వారీగా సర్వే

పన్నుల రూపంలో అదనపు ఆదాయాన్ని సమకూర్చే క్రమంలో సచివాలయాల వారీగా పునః సమీక్షిస్తున్నారు. ఆయా సచివాలయాల పరిధిలో ఎన్ని నివాసాలు, ఎన్ని వాణిజ్య సముదాయాలు ఉన్నాయి? వీటన్నింటికీ పన్ను ఉందా? కొలతల ఆధారంగా పన్ను పడిందా? లేదా? అనే అంశాలపై సర్వే చేస్తున్నారు. రానున్న 10–15 రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసి నివేదిక సిద్ధం చేయనున్నారు. ఆ తరువాత సవరించిన అసెస్‌మెంట్లు, కొత్త అసెస్‌మెంట్ల కోసం ఆయా భవన యజమానులకు నోటీసులు ఇవ్వనున్నారు. ఈ మేరకు కమిషనర్ భావన రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

పారదర్శకంగా సమీక్షించండి



పన్నుల పరిధిలోకి రాని ఇళ్లు, సవరించాల్సిన పన్నులు, కొత్త అసెస్‌మెంట్లను గుర్తించే ప్రక్రియ వేగవంతంగా చేపట్టాలని ఆదేశించాం. ఈ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేసి నగరపాలక సంస్థకు మరింత అదనపు ఆదాయం వచ్చేలా సంబంధిత సిబ్బంది దృష్టిపెట్టాలి. ఆదాయం పెరగడం ద్వారా నగరంలో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించే వీలుంటుంది.

– భావన, కమిషనర్, నగరపాలక సంస్థ, కాకినాడ

తిరుమలలోని వెయ్యికాళ్ల మండపాన్ని పునర్నిర్మించాలి


శ్రీవారి జపయజ్ఞ పారాయణలో పాల్గొన్న భక్తులు

బోట్‌క్లబ్: తిరుమలలో వెయ్యి కాళ్ళ మండపాన్ని పునఃనిర్మించాలని భోగిగణపతి పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు డిమాండ్ చేశారు. శనివారం ఉదయం సుప్రభాత వేళలో పీఠం ప్రాంగణంలోని తిరుమల శ్రీవారి పాదాల వద్ద గోవిందుని 43వ సహస్ర నామ జపయజ్ఞ పారాయణలో సంకీర్తన నిర్వహించారు. తిరుమలలో వెయ్యి కాళ్ల మండపాన్ని తొలగించి మరోచోట నిర్మించాలని ప్రతిపాదనలు చేసినా కార్యరూపం దాల్చలేదన్నారు. సంస్కృతి సంప్రదాయాలను పూర్వకట్టడాల ప్రాచీన వారసత్వ సంపదను పరిరక్షించాలన్నారు.

క్లుప్తంగా

సుప్రీం తీర్పుపై ఎమ్మార్పీఎస్ హర్షం


నడకుదురులో బాబూజగ్జీవన్‌రామ్‌కు నివాళులు అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్, కూటమి నాయకులు

కరప: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఎమ్మార్పీఎస్ నాయకులు, మాదిగ సామాజికవర్గం నాయకులు హర్షం వ్యక్తంచేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ పోరాటం ఇంతకాలానికి ఫలించిందని ఆ వర్గీయులు సంబరాలు చేసుకున్నారు. మండలం నడకుదురులోని ఎమ్మార్పీఎస్ నాయకులు, కూటమి నాయకులు శనివారం మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్దకు చేరుకుని, పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రధాని నరేంద్రమోడి, రాష్ట్ర సీఎం చంద్రబాబులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ఉందుర్తి ప్రకాషరావు, ఆకుమర్తి ఏడుకొండలు, సవరపు రవి, పలివెల ప్రవీణ్, కె.నానీ, మందపల్లి పద్దరమణ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే శ్రేయస్కరం


తల్లిపాల ప్రాధాన్యాన్ని వివరిస్తూ నర్సింగ్ విద్యార్థుల ర్యాలీ

కాకినాడ క్రైం: తల్లిపాలే ముద్దు.. డబ్బాపాలు వద్దు అనే నినాదంతో నర్సింగ్ విద్యార్థులు, అంగన్వాడీలు, ఏఎన్ఎంలు శనివారం జీజీహెచ్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు కార్యక్రమంలో జీజీహెచ్‌లో మదర్ మిల్క్ బ్యాంక్ నిర్వహిస్తున్న సుశేష ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించారు. వివిధ విభాగాలకు చెందిన అధికారులు తల్లిపాల ప్రాధాన్యాన్ని వివరించారు.

అవయవదానంతో ప్రాణదానం

కాకినాడ రూరల్: రోడ్డు ప్రమాదాలు తదితర కారణాలతో బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి సేకరించిన అవయవాలను అవసరమైన వారికి అమర్చడం ద్వారా ప్రాణదాతలు అవుతారని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జాతీయ అవయవ దినోత్సవాన్ని నిర్వహించారు. కాలేయం, మూత్రపిండాలు, పేగులు, ఊపిరితిత్తులు, గుండె, ప్రాంక్రియాసిస్ వంటి అవయవ దానాలతో 8 మంది ప్రాణాలను కాపాడువచ్చన్నారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, డాక్టర్ శిరీష, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

రోటరీ సేవలు అద్భుతం


క్లబ్ సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయమూర్తి

బోట్‌క్లబ్: రోటరీ గోల్డెన్‌జూబ్లీ క్లబ్ సమావేశం స్థానిక రోటరీ హాల్‌లో శనివారం జరిగింది. మూడు దశాబ్దాలుగా భారీ స్థాయిలో శాశ్వత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రోటరీ మాజీ గవర్నర్ కేవీఎస్ ఆంజనేయమూర్తి అన్నారు. రోటరీలోకి కొత్త తరం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మన రోటరీ జిల్లా నుంచి అంతర్జాతీయ రోటరీకి రూ.10 లక్షల డాలర్లు విరాళంగా అందించిన ఘనత దక్కిందన్నారు. క్లబ్ అధ్యక్షులు ఎన్ శ్రీకాంత్, కార్యదర్శి దామోర శ్రీకాంత్, కోశాధికారి పి స్వరూప్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు సహాయ నిధి వసూలు


సహాయ నిధి వసూలు చేస్తున్న సీపీఎం నాయకులు

కాకినాడ సిటీ: కేరళ వయనాడ్ బాధితులకు సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం జీజీహెచ్ నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద సహాయ నిధి వసూలు చేశారు. సీపీఎం నాయకులు దువ్వా శేషుబాబ్జీ, పలివెల వీరబాబులు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సమయంలో రాజకీయ ప్రయోజనాలు పక్కన పెట్టి బాధితులను ఆదుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కాకుండా స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలను, పౌర సమాజాన్ని భాగస్వాములను చేసుకుని చర్యలు చేపట్టాలన్నారు. నగరంలో సహకరించిన ప్రజలకు సీపీఎం నాయకులు వెంకటరమణ, కె.నాగజ్యోతి, దుంపల ప్రసాద్‌లతో పాటు చంద్రమళ్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం


సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న మండల ఎస్సీ నాయకులు

కరప: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ మండల అంబేడ్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఎస్సీలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. మండల అంబేడ్కర్ యువజన సేవాసంఘం అధ్యక్షుడు చిన్నం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మండల ఎస్సీ నాయకులు శనివారం కరపలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఎస్సీ నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో చేసిన వర్గీకరణ చెల్లదని సుప్రీంకోర్టు నాడు తీర్పు ఇవ్వగా, ఇప్పుడు మళ్లీ ఈ బాధ్యత రాష్ట్రానికి అప్పగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తీర్పును సుప్రీం కోర్టు పునఃసమీక్షించాలని, అంతవరకు ప్రభుత్వం వర్గీకరణ విషయంలో ముందుకు వెళ్లకూడదని మండల ఎస్సీ నాయకులు విజ్ఞప్తి చేశారు. వైస్ ఎంపీపీ బొమ్మిడి వీర్రాఘవులు, మండల అంబేడ్కర్ యువజన సేవాసంఘం, మండల ఎస్సీ నాయకులు సాదే లోహిదాస్, మాతా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే సమస్యలు పరిష్కరించాలి



ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

- ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

కాకినాడ సిటీ: ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా ప్రజా రవాణా కార్యాలయం వద్ద యునైటెడ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని తొమ్మిది డిపోల నుంచి ఆర్టీసీ ఉద్యోగులు ధర్నాలో పాల్గొన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు శిక్షల విషయంలో సమన్యాయం పాటిస్తున్న సర్క్యులర్ 1/2019ను కచ్చితంగా అమలు చేయాలని, ఆర్టీసీలో ప్రమాదాలకు కారణం అవుతున్న డబుల్ డ్యూటీలను రద్దు చేసి డ్రైవర్ల నియామకాలు చేపట్టాలని, ఆర్టీసీ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ నుంచి మినహాయించి పరిమితి లేని రిఫరల్ వైద్యం కల్పించాలని, ఓవర్ టైం డ్యూటీలను రెస్ట్ ఆఫ్ డ్యూటీలుగా మార్చాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా ప్రజా రవాణా అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాలో ప్రధాన కార్యదర్శి కేఎస్‌పీ రావు, కాకినాడ డిపో అధ్యక్షుడు కె.గోవిందు, రాజమహేంద్రవరం డిపో కార్యదర్శి బీఆర్‌కే కుమారి, బహుజన ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ ఫరీద్ ఖాసిం తదితరులు ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు.

8న వ్యక్తిగతంగా హాజరుకండి

- పీఆర్ ప్రిన్సిపాల్‌కు హైకోర్టు ఆదేశం

కాకినాడ: స్థానిక పీఆర్ ప్రభుత్వ కళాశాలలో ఓ విద్యార్థినిని ప్రాక్టికల్స్‌కు అనుమతించాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ లెక్క చేయకపోవడంతో ప్రిన్సిపాల్ తిరుపాణ్యంను ఈ నెల 8వ తేదీన వ్యక్తిగతంగా హాజరు కావాలని శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే కళాశాల బయో టెక్నాలజీ విద్యార్థి మనీషా శ్రీ సాయి మేఘనకి ఆఖరి విద్యా సంవత్సరంలో అటెండెన్స్ తక్కువైంది. దీంతో ప్రిన్సిపాల్ తిరుపాణ్యం జూలై రెండో తేదీన నిర్వహించిన థియరీ పరీక్షలకు మాత్రం అనుమతించి ప్రాక్టికల్స్‌కు అనుమతించలేదు. దీంతో ఆమె హైకోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ ప్రాక్టికల్స్‌కు అనుమతించాలని ఆదేశించింది. అయినప్పటికీ కోర్టు ఆదేశాలను లెక్కచేయకపోవడంతో మేఘన మళ్లీ కోర్టును ఆశ్రయించి. దీంతో కోర్టు స్వయంగా హాజరుకావాలని ఉత్తర్వులు ఇచ్చింది. విద్యార్థి తరపున న్యాయవాది మతుకుమిల్లి శ్రీవిజయ్ కేసు వాదించారు.

దుష్ప్రచారం చేస్తున్నవారిపై ఎస్పీకి ఫిర్యాదు చేస్తా


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్

కాకినాడ సిటీ: తనను మోసగించిన వారిపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తానని, తనపై కేసులు నమోదు చేసి జైలులో ఉంచారంటూ చేస్తున్న దుష్ప్రచారంలో ఎంతమాత్రం నిజం లేదని సాయిసిరి టెక్నాలజీస్ సీఈవో కొప్పిశెట్టి షణ్ముఖ్ సుదర్శన్ అన్నారు. శనివారం కాకినాడలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్‌లో తాను నిర్వహిస్తున్న సంస్థ బ్రాంచిని 2022లో ఏర్పాటు ఇంద్రపాలేనికి చెందిన గీసాల శ్రీను, అతని కుమారులు ఆనంద్, వీరబాబులకు అప్పగించానని, కొంతకాలం నిర్వహించాక వారు అవకతవకలకు పాల్పడడంతో ప్రశ్నించానన్నారు. దీనిపై వారు కక్షగట్టి తనపై దుష్ప్రచారానికి పాల్పడుతున్నారన్నారు. వారిపై పరువు నష్టం దావా వేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సుదర్శన్ భార్య రేఖ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

7న దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరం


ప్రత్తిపాడులో శిబిరం నిర్వాహణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ నారాయణమూర్తి

ప్రత్తిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ నెల ఏడో తేదీన విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా అందించే ఉపకరణాల గుర్తింపు కోసం ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎస్.డేవిడ్ రాజ్ తెలిపారు. లెక్టర్ ఆదేశాల మేరకు ఏఎల్ఐఎంసీఓ సంస్థ సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ శిబిరంలో మూడు చక్రాల సైకిల్, చంక కర్రలు, కాలిపర్స్, చెవి మెషీన్లు, వీల్ చైర్స్, కృత్రిక కాళ్ళు, రోలేటర్స్, వాకింగ్ స్టిక్స్, లెప్రసీ సోకిన వారికి ఏడీఎల్ కిట్స్, మానసిక ప్రతిభావంతుల పిల్లలకు కిట్లు, ఎలక్ట్రికల్ మూడు చక్రాల సైకిల్ పంపిణీకి అర్హులను ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. ఈ శిబిరానికి సదరన్ ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, యూడీఐడీ కార్డుతో హాజరుకావలన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగే ఈశిబిరాన్ని నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాలకు చెందిన ప్రత్యేక ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ డేవిడ్‌రాజ్ కోరారు.

శిబిర స్థలాన్ని పరిశీలించిన డీఎల్‌డీఓ

ప్రత్తిపాడులో నిర్వహించే దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరం ప్రదేశాలను కాకినాడ డివిజనల్ అభివృద్ధి అధికారి (డీఎల్‌డీఓ) పాటంశెట్టి నారాయణమూర్తి శనివారం సాయంత్రం పరిశీలించారు. శిబిరం నిర్వాహణకు అనువుగా ఉండే ఎంపీడీఓ కార్యాలయ వద్ద, లయన్స్‌క్లబ్ కమ్యూనిటీ హాలు తదితర ప్రాంతాలను పరిశీలించారు. చివరకు ఎంపీడీఓ కార్యాలయం వద్ద శిబిరం నిర్వాహించేందుకు నిర్ణయించారు. ఆయన వెంట ఎంపీడీఓ డేవిడ్‌రాజ్, ఎంఈఓ వి.రాజబాబు, పంచాయతీ కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాసరావు, బి.వీరబాబు, సురేష్ తదితరులున్నారు.

ఫిజియోథెరపిస్ట్ సేవలు అభినందనీయం


డాక్టర్ మారుతిని సత్కరిస్తున్న ఎంఈఓలు, హెచ్ఎం, దివ్యాంగుల తల్లిదండ్రులు

కరప: దివ్యాంగ పిల్లలకు ఓర్పు, సహనంతో వ్యాయామాలు చేయిస్తూ, అందించిన సేవలు అభినందనీయమని ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రంలో ఫిజియోథెరపిస్ట్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎంఎం మారుతి పెదపూడి మండలానికి బదిలీపై వెళుతున్న సందర్భంగా శనివారం దివ్యాంగులు, తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ మారుతిని ఎంఈఓలు బుల్లికృష్ణవేణి, సత్యనారాయణ, హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు ఘనంగా సత్కరించారు. ఐఈఆర్‌పీలు కె.స్వాతి, ఎస్.మల్లేశ్వరి, కేర్ టేకర్ డి.తనూజ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం


నిరుపేదలకు భోజనాన్ని వడ్డిస్తున్న సంఘ సభ్యులు

బోట్‌క్లబ్: స్థానిక టూటౌన్ సమీపంలోని హరీష్ స్పోర్ట్స్ వద్ద డొక్కా సీతమ్మ అన్నపూర్ణాదేవి సేవా సంఘం ఆధ్వర్యంలో 250 మందికి అన్నదానం చేశారు. సంఘం చైర్మన్ తలాటం హరీష్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జయ కృష్ణమోహన్, వైష్ణవి, కోటయ్య స్వీట్స్ అధినేత రామ్‌కుమార్, పినిశెట్టి సురేష్, కరప తాతీలు, కృష్ణవేణి, పిడికా శేషు పాల్గొన్నారు.

భారీ వృక్షాల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ


రిలయన్స్ ప్రతినిధులతో చర్చిస్తున్న ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకేలోని భారీ వృక్షాల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. వర్సిటీలో శనివారం నీటి సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై సమీక్షించి భారీ వృక్షాలను సందర్శించారు. హెరిటేజ్ వృక్షాల సంపదకు రిలయన్స్ సహకారం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్ర, రిలయన్స్ కాకినాడ అసెట్ టెక్నికల్ హెడ్ వేణుగోపాలరాజు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రాపై అవగాహన లేని మహిళలెందరో


సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా నాయకురాలు రమణి

- వారిని రాజకీయంగా వాడుకుంటున్న పార్టీలు
- చైతన్యం నింపడంలో చిత్తశుద్ధి కరవు
- ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి రమణి
- సుందరయ్య భవన్‌లో అవగాహన సదస్సు

కాకినాడ సిటీ: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో కాకినాడ సుందరయ్యభవన్‌లో డ్వాక్రా సంఘాల నిర్వహణపై శనివారం అవగాహన వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సీహెచ్ రమణి మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపుల నిర్వహణపై మెజారిటీ మహిళలకు అవగాహన లేకపోవడం వల్ల నష్టపోతున్నారన్నారు. ఏ ప్రభుత్వమైనా రాజకీయ సమావేశాలకు ఉపయోగించుకోవడం తప్ప వారిలో చైతన్యాన్ని నింపే చిత్తశుద్ధి లేకపోవడం బాధాకరమన్నారు. వారు దాచుకున్న పొదుపు సొమ్ముపై వారి హక్కు అనే విషయం తెలియకుండా ఉన్నారన్నారు. అందుకే బ్యాంకు వారు వారి సొమ్ము లోన్‌గా తీసుకోకుండా అడ్డు చెప్తున్నప్పటికీ మాట్లాడడం లేదన్నారు. గ్రూపులు ఏర్పాటు చేసింది మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ అవగాహన కల్పించడం కోసమని ప్రభుత్వాలు మరచిపోయాయని రమణి విమర్శించారు. వారికి అవగాహన కల్పించే చర్యలు చేపట్టాలని ఐద్వా డిమాండ్ చేసింది. అన్ని జిల్లాల్లో డ్వాక్రా గ్రూపులపై సర్వే నిర్వహించి వచ్చిన సమస్యలపై రాష్ట్ర జిల్లా అధికారులకు వినతి పత్రాల ద్వారా తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి కె.వరలక్ష్మి, నాయకులు జి.గంగాభవాని, ఐ.దుర్గా, కె.మణి, పి.లావణ్య, జె.వెంకటలక్ష్మి, కె.ఈశ్వరి, సీహెచ్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ బ్రాంచ్‌తో సాంకేతిక నైపుణ్యం


ఈసీఈ స్టూడెంట్ బ్రాంచ్ కార్యవర్గ సభ్యులు

బాలాజీచెరువు: సాంకేతిక నైపుణ్యాల పెంపునకు స్టూడెంట్ బ్రాంచ్ దోహదపడుతుందని జేఎన్‌టీయూకే ప్రిన్సిపాల్ ఎన్.మోహనరావు పేర్కొన్నారు. శనివారం ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో స్టూడెంట్ బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్‌బీఏ గుర్తింపుకు ఈ స్టూడెంట్ బ్రాంచ్‌లు దోహదపడతాయని, ఇంటర్‌స్కిల్స్, నైపుణ్యాభివృద్ధి అంశాలను మెరుగుపర్చేందుకు ఐఈఈఈ ఒక మంచి వేదికగా నిలుస్తుందన్నారు. కమిటీ అధ్యక్షుడిగా పి.ఓంకారమ్, వైస్ ప్రెసిడెంట్‌గా వి.దివ్యాంజలి, ఎస్.వెంకటలక్ష్మి, కార్యదర్శి పి.వి జయకావేరి, సంయుక్త కార్యదర్శిగా ఎం.పవన్‌విఘ్నేష్ కుమార్, కోశాధికారిగా టీవీ రమణిలు ఎన్నికైయారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ బ్రాంచ్ కౌన్సెలర్ డాక్టర్ బి.లీలాకుమారి, ఐఐఐపీటీ డైరెక్టర్ సాయికృష్ణ పాల్గొన్నారు.

మత్తు జోలికి వెళ్లొద్దు



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, చిత్రంలో జస్టిస్ కమలాదేవి, సెబ్ అదనపు ఎస్పీ శ్రీలక్ష్మి

- యువతకు న్యాయమూర్తి కమలాదేవి హితవు

కాకినాడ క్రైం: మత్తు జోలికి వెళ్లవద్దని మండల లీగల్ సెల్ సర్వీసెస్ కమిటీ అధ్యక్షురాలు, మూడో జిల్లా అదనపు సెషన్స్ జడ్జి పి.కమలాదేవి హితవు పలికారు. స్థానిక రంగరాయ వైద్య కళాశాల ఆడిటోరియంలో సైకియాట్రీ విభాగం ఆధ్వర్యంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వానపల్లి వరప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం పొగాకు ఉత్పత్తుల వినియోగం–అనర్థాలు అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకి ముఖ్య అతిథులుగా జస్టిస్ కమలాదేవితో పాటు డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వీసీ, డీఎంఈ, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, సెబ్ అదనపు ఎస్పీ శ్రీలక్ష్మి హాజరయ్యారు. మాదకద్రవ్యాలు అనుబంధ పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై వారు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల బాధితులకు జీజీహెచ్‌లో సేవలు అందిస్తున్న డాక్టర్ వరప్రసాద్ బృందాన్ని ఈ సందర్భంగా అభినందించారు. సదస్సు నిర్వహణకు కృషి చేసిన సైకియాట్రీ హెచ్‌వోడీ డాక్టర్ రామచంద్రరావు, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ దేవీ మాధవిల కృషిని కొనియాడారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ ఉమామహేశ్వరరావు తదితరులు హాజరయ్యారు.

శ్రీవినాయక్ చిట్స్ అధినేత అరెస్ట్

సెంట్రల్ జైలుకు రిమాండ్‌కు తరలింపు

కాకినాడ క్రైం: చిట్ పాటదారులకు తమ సొమ్ములు అప్పగించడంలో జాప్యం వహించిన శ్రీవినాయక చిట్‌ఫండ్స్ అధినేత సేతు మాధవరావును శనివారం కాకినాడ టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. మాధవరావు తమకు పాడుకున్న సొమ్ము అప్పగించలేదని 26 మంది బాధితులు కాకినాడ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. ఈ మొత్తం విలువ రూ.1.08 కోట్లుగా లెక్క తేల్చారు. మరింత మంది బాధితులు పోలీసులను ఆశ్రయించే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ ఫిర్యాదు మేరకు కాకినాడ టూ టౌన్ సీఐ నాగేశ్వరనాయక్ కేసు నమోదు చేశారు. మాధవరావును శనివారం అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు రిమాండ్‌కు తరలించినట్లు ఆయన వెల్లడించారు.